




క్రీడలతో బంగారు భవిష్యత్

- రాష్ట్రస్థాయి టీటీ పోటీల ప్రారంభంలో ఎంపీ రఘురాంరెడ్డి 6
- అన్ని జిల్లాల నుంచి క్రీడాకారుల రాక



ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం 11 అక్టోబరు 2025
5

దక్షిణ అయోధ్యగా
భద్రాద్రి అభివృద్ధి

- పనులు వేగవంతంగా చేపట్టండి
- ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం
- త్వరలో పనులు ప్రారంభం: మంత్రి తుమ్మల
- హైదరాబాద్ సచివాలయంలో మంత్రి సమీక్ష



హైదరాబాద్‌లో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యతో కలిసి భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ భద్రాచలం: ప్రముఖ పుణ్యక్షేత్రంగా, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వరాలయ పనులను త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి టీటీడీ బృందం సోమవారం ఖమ్మానికి రాబోతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజరామయ్యతోపాటు ఆలయ అభివృద్ధిపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులతోపాటు ఖమ్మంలో ఏర్పాటు కాబోతున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పనులపైనా మంత్రి తుమ్మల సమీక్షించారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. మాడవీధుల విస్తరణకు సంబంధించి భూసేకరణ పూర్తయిందన్నారు. మాడవీధుల విస్తరణ పనులు, ప్రాకార గోడల నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలన్నారు. ఆగమశాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి.. ఆలయ రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణంలో ప్రతీ అంశం ఆగమ శాస్త్ర ప్రకారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రాద్రి ఆలయాన్ని (మిగతా 6వ పేజీలో)

డీసీసీ చీఫ్
ఎవరో?



కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల నియామకానికి కసరత్తు

- నేడు ఖమ్మానికి పరిశీలకుల రాక.. దరఖాస్తుల స్వీకరణ
- మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం
- తమ అనుచరులకే అధ్యక్ష పీఠం దక్కేలా ముఖ్య నేతల యత్నాలు
- భద్రాద్రి జిల్లాకు ఏఐసీసీ పరిశీలకుడిగా జాన్సన్ అబ్రహం

ఖమ్మం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పీఠం ఎంపికకు కసరత్తు మొదలైంది. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డీసీసీ (డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ) లకు కొత్త జిల్లా అధ్యక్షులు ఎన్నిక కాబోతున్నారు. అలాగే ఖమ్మం, కొత్తగూడెం నగర అధ్యక్షులను కూడా ఎన్నుకోనున్నారు. ఈ మేరకు రెండు జిల్లాలకు ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఖమ్మం జిల్లాకు తమిళనాడుకు చెందిన మహేంద్రన్, పీసీసీ పరిశీలకులుగా డాక్టర్ పి.శ్రవణ్‌కుమార్ రెడ్డి, చకిలం రాజేశ్వరరావు, ఎం.రాజీవ్‌రెడ్డి, రవళిరెడ్డి నియమితులయ్యారు. శనివారం వారు ఖమ్మానికి చేరుకుని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. ఖమ్మం డీసీసీ, నగర అధ్యక్ష పదవులకు సంబంధించి ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరగనుంది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. అయితే గతంలో లాగా నాయకులు చెప్పిన వారికి పదవులు కాకుండా ఈసారి దరఖాస్తుల ప్రకియ జరగనుంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవితో పాటు నగర అధ్యక్ష పదవులకు శనివారం ఉదయం 10గంటల నుంచి సంజీవ రెడ్డిభవన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కాంగ్రెస్ వర్గాల్లో డీసీసీ పీఠంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరీ వర్గీయులు తమ అనుచరులతో డీసీసీ పీఠం కోసం దరఖాస్తు చేయించనున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్ 2018అసెంబ్లీ ఎన్నికలకు ముందు నియామకమై ఇప్పటి వరకు కొనసాగుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కొనసాగుతున్నారు. అయితే గతంలో కంటే ఈసారి రెండు జిల్లాల్లో కాంగ్రెస్ మరింత బలపడింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి జిల్లాలో 10సీట్లకు గాను 9 గెలవగా.. రెండు ఎంపీలు కూడా పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. రాష్ట్ర కేబినేట్‌లో ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు జిల్లా నుంచి రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఎన్నిక కాగా.. కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఉమ్మడి జిల్లాలో నాలుగు దక్కాయి. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఈయేడు మార్పు ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. దరఖాస్తుల స్వీకరణ అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుల అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను నియమించనున్నారు. పీసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు నియోజకవర్గాల్లో పర్యటించి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ప్రస్తుతం ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి డీసీసీ పదవిపై పోటాపోటీ పోరు నడుస్తోంది. నాలుగు వర్గాల నుంచి తమ అనుచరులకు పీఠం దక్కించుకునేందుకు పైస్థాయిలో పావులు కదుపుతున్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం పీసీసీ, ఏఐసీసీ స్థాయిలో చర్చించి పదవులకు నియామకాలు చేయనున్నారు. మొత్తమ్మీద స్థానిక సంస్థల ఎన్నికల సందడి కోర్టు స్టేతో నిలవగా.. ఇప్పుడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవుల నియామకంతో కాంగ్రెస్ రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జాన్సన్ అబ్రహం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఏఐసీసీ పరిశీలకుడిగా జాన్సన్ అబ్రహంను నియమించారు. ఆయనతోపాటు రాష్ట్రంనుంచి పీసీసీ పరిశీలకులుగా జంగా రాఘవరెడ్డి, అబ్దుల్‌యూసుఫ్‌జహీ, ఇ.సుబ్బారావు, సంజీవ్‌ముదిరాజ్, వైసీ సాగరిక నియమితులయ్యారు. వీరు కూడా దరఖాస్తుల తేదీ ఖరారు చేసి.. మరో రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నారు.

ఆర్టీసీ
బస్సులు ఢీ

- 30 మందికి గాయాలు
- అతి వేగమే ప్రమాదానికి కారణం
- సారపాక వద్ద ఘటన
- ప్రాణాపాయం లేదని వైద్యుల వెల్లడి 6

రోడ్డు ప్రమాదంలో బాలుడు, బాలిక మృతి

- మరో బాలుడి పరిస్థితి విషమం
- అతి వేగమా!? ఏదైనా వాహనం ఢీకొట్టిందా!? 7
- ఘటనపై పలు అనుమానాలు

రామయ్య సేవలో..

- భద్రాచలానికి కించిత్ కారన్ ట్రస్టు భక్త బృందం
- 1500 మంది ఒకేసారి రాక
- నిత్యకల్యాణంలో పాల్గొన్న 225 జంటలు

భద్రాచలం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రానికి చెందిన కించిత్ కారన్ ట్రస్టు భక్త బృందం శుక్రవారం భద్రాచల రామయ్యను దర్శించుకున్నారు. ట్రస్టు నిర్వాహకులు వేలుకుడి కృష్ణన్ ఆధ్వర్యంలో భక్త బృందం పురుషోత్తముడు పేరుతో పిలువబడే క్షేత్రాలను సందర్శించే ప్రక్రియలో భా గంగా పురుషోత్తమ విద్యాయాత్రను నిర్వహిస్తున్నా రు. ఇందులో భాగంగా ట్రస్టు సభ్యులు మంగళగిరి, సింహాచలం, శ్రీకూర్మం, పూరి, భద్రాచలం, అహోబిలం క్షేత్రాలను సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం వచ్చిన వారు ఉదయం ట్రస్టు సభ్యులంతా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం చిత్రకూట మండపంలో స్వామివారి నిత్యకల్యాణం నిర్వహించగా.. 225జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి. ఇదిలా ఉండగా.. ట్రస్టు సభ్యులు తాము సందర్శించే క్షేత్రాలలో భగవద్గీతలోని పురుషోత్తమప్రాప్తి యోగ పారాయణాన్ని నిర్వహిస్తుండడం విశేషం. ట్రస్టు సభ్యులు మొత్తం 1500మంది రామయ్యను దర్శించుకున్నారు. గతంలో సైతం ఈ భక్త బృందం రామయ్యను దర్శించుకున్నారు.

భద్రగిరి శతకానికి స్వరరూప సంకల్పం

తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ భద్రాద్రి కోదండ రామస్వామిపై రచించిన భద్రగిరి శతకానికి స్వర రూపం ఇచ్చి సీడీ విడుదల చేయాలని గరికపాటి రామమూర్తి సంకల్పించారు. ఈ క్రమంలో శుక్రవారం ఆయన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గరికపాటి రామ్మూర్తి మాట్లాడుతూ.. విశ్వనాథ సత్యనారాయణ రాసిన అన్ని శతకాలు కలిపి విశ్వనాథ మధ్యాక్కరలు ప్రచురించగా, దానికి 1963లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం జరిగిందన్నారు. దీనిని భక్తులు, పండితులకు శ్రవణప్రియంగా వినిపించాలనే సంకల్పంతో భద్రగిరి శతకానికి స్వర రూపం సీడీని రూపొందించనున్నట్లు తెలిపారు. గతంలో వేములవాడ రాజరాజేశ్వరి శతకాన్ని పూర్తి చేయగా.. భవిష్యత్తులో భద్రగిరి శతకాన్ని స్వరపరిచి సీడీ రూపంలో తేనున్నట్లు చెప్పారు. మద్దూరి చంద్రశేఖర్ సమర్పణలో ఈ రోజు స్వామి వారిని దర్శించి ఆయన అనుగ్రహం పొందినట్లు తెలిపారు.



పాల్గొన్న కించిత్ కారన్ ట్రస్టు భక్త బృందం

నేడు నగరంలో తుమ్మల పర్యటన

- ఖమ్మం నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఖమ్మం నగరంలో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతోపాటు రాష్ట్ర, జిల్లా నాయకులు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మార్కెట్ కమిటీ, ఆత్మ కమిటీ, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు అనుబంధ సంఘ అధ్యక్షులు, ఖమ్మం నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొననున్నారు.

ఏఐతో ఘరానా మోసం

- చంద్రబాబు, దేవినేని ఉమా మాట్లాడినట్టు నమ్మించిన వైనం
- మోసపోయిన తెలుగు తమ్ముళ్లు
- ఆరా తీస్తున్న తెలంగాణ, ఏపీ నిఘా వర్గాలు

సత్తుపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీకి చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమాలు మాట్లాడుతున్నట్టు కృత్రిమమేధ (ఏఐ)తో వీడియో కాల్స్ చేసి ఏపీకి చెందిన ఓ వ్యక్తి ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులను మోసగించి నగదు కాజేసిన ఘటన సంచలనం రేపింది. ఈ సంఘటన తెలుగు రాష్ట్రాల్లో వైరల్‌గా మారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే..

గత నెల 30న ఓ వ్యక్తి జిల్లాలోని సత్తుపల్లి మండలానికి చెందిన టీడీపీ అభిమాని ఒకరికి ఫోన్‌చేశాడు. తాను మాజీ మంత్రి దేవినేని ఉమా పీఏనని చెప్పి పరిచయం చేసుకున్నాడు. దేవినేని ఉమా వీడియో కాల్‌లో మాట్లాడతారని నమ్మించి.. దేవినేని ఉమాను పోలిన వ్యక్తితో అదే స్వరంతో మాట్లాడించడంతో టీడీపీ అభిమానులు నమ్మారు. తెలంగాణలో పేద పిల్లల చదువు నిమిత్తం సాయం చేయాలని దేవినేని ఉమాను పోలిన వ్యక్తి కోరడంతో.. వెంటనే సదరు అభిమాని రూ.35వేలను యూపీఐ ద్వారా బదిలీ చేశాడు. వారం రోజుల తర్వాత సదరు వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో మీకు బీ ఫారం అందిస్తామని చెప్పి.. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీతో వీడియో కాల్‌లో మాట్లాడతారని చెప్పారు. ఆ మేరకు మళ్లీ వీడియో కాల్ చేసి చంద్రబాబును పోలిన వ్యక్తి వీడియో కాల్‌లో మాట్లాడి వారిని అభినందించారు. అనంతరం అమరావతి వస్తే చంద్రబాబుతో అపాయింట్‌మెంట్ ఇప్పిస్తానని, విజయవాడలో ఓ హోటల్‌లో గదులు కూడా బుక్ చేసినట్లు సదరు వ్యక్తి నమ్మించాడు. దీంతో తమ అభిమాన నాయకుడు చంద్రబాబును కలుసుకోవచ్చని సత్తుపల్లి మండలం నుంచి 18మంది ఈ నెల 8వ తేదీన విజయవాడలోని హోటల్‌కు చేరుకున్నారు. ఆ రోజు సాయంత్రం వరకూ అక్కడే వేచి చూసి సదరు వ్యక్తికి ఫోన్ చేయగా.. తాను ఒక కార్యకర్తకు అనారోగ్యంగా ఉండడంతో ఆస్పత్రికి తీసుకొని వచ్చానని, అతను ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని.. అత్యవసరంగా రూ.10వేలు కావాలని చెప్పి, వాటిని పంపాలని కోరాడు. ఇదే సమయంలో హోటల్‌లో భోజనాల బిల్లు చెల్లించాలని యాజమాన్యం డిమాండ్ చేసింది. ఈ క్రమంలో తమకు వసతి ఏర్పాటు చేసిన వ్యక్తి వచ్చి బిల్లు కడతారని చెప్పడంతో.. అలాంటి ఏర్పాట్లు ఎవరూ చేయలేదని యాజమాన్యం చెప్పింది. ఈ విషయమై గొడవ జరగటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అసలు విషయం ఏంటని ఆరా తీయగా.. చంద్రబాబు, దేవినేని ఉమా పేర్లతో (మిగతా 6వ పేజీలో)



ఏఐతో వీడియోకాల్‌లో చంద్రబాబు మాట్లాడుతున్నట్టుగా ఉన్న చిత్రం



వైద్య బృందాల ఆధ్వర్యంలో ఏజెన్సీ పర్యటన



మాట్లాడుతున్న వైద్య బృందం

భద్రాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలకు చెందిన 70 మంది వైద్య విద్యార్థులు 12 మంది సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో సేవాంకూర్ భారత్ ఆధ్వర్యంలో భద్రాచలంలోని సరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం వైద్యసేవలందించారు. అలాగే సరిహద్దున ఉన్న ఏపీలోని అల్లూరి జిల్లా చింతూరు, కూనవరం మండలాల్లోని ఏడు గ్రామాల్లో శనివారం వైద్య బృందాల ఆధ్వర్యంలో వైద్య సేవలందించనున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలను పరీక్షించి వారికి అవసరమైన రూ.లక్ష విలువైన మందులను ఉచితంగా అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని వైద్య విద్యార్థుల్లో వృత్తి పట్ల అంకిత సేవా భావాలు పెంపొందించేందుకు నిర్వహిస్తున్నట్లు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జయ సందేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణలోని ఏడు వైద్య కళాశాలలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛందంగా రావడం విశేషం. ఈ కార్యక్రమంలో సేవా భారతి మెడికల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్, ఆరోగ్యభారతి ఏజెన్సీ ప్రాంత జాతీయ బాధ్యులు డాక్టర్ మురళీకృష్ణ, పాల్గొన్నారు.

బోధన, ఆయాలకు ఇంటర్వ్యూలు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పాఠశాలలో ప్రీప్రైమరీ పాఠశాలలకు సంబంధించి బోధన, ఆయాల నియామకానికి అభ్యర్థులకు ఈ నెల 13, 14 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ డివిజన్ అధికారి జి. నరసింహారావు శక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న కొణిజర్ల, ముదిగొండ, నేలకొండపల్లి, రఘునాథపాలెం, సింగరేణి మండలాలకు 14న ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాలో ఎంపికైన పాఠశాలకు ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డీఎంఎల్‌టీ, డీడీటీ కోర్సులు చదివేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 ఏడాదికి గాను కొత్తగూడెం మెడికల్ కళాశాలలో డీఎంఎల్‌టీ-30 సీట్లు, డిప్లమా ఇన్ డియాలసిస్ టెక్నీషియన్ (డీడీటీ) -30 సీట్లు భర్తీకై అర్హులైన ఇంటర్మీడియట్ బైపీసీ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 28వ తేదీ వరకు తమ దరఖాస్తులను మెడికల్ కళాశాలలో అందజేయవలసిందిగా కోరారు.

అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగి మృతి

» కుమారుడి మృతిపై అనుమానాలు లేవన్న తల్లిదండ్రులు

బోనకల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బోనకల్ పాత రైల్వే క్వార్టర్స్‌లో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగి మృతి చెంది ఉండటం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. షేక్.ఖాదర్‌బాబు(55) రైల్వే గ్యాంగ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. భార్యభర్తల మధ్య వివాదం తలెత్తడంతో 15ఏళ్ల క్రితం భార్య కుమారుడితో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఖాదర్‌బాబు ఒంటరివాడు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. దసరా పండుగరోజు మద్యం సేవించి ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో తోటి ఉద్యోగులు ఎక్కడికో వెళ్లి ఉంటాడని భావించారు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టూపక్కల వారు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం పడి ఉండటాన్ని చూసి తమ కుమారుడిదేనని గుర్తించారు. అనారోగ్య కారణం వల్ల కానీ లేక ప్రమాదవశాత్తూ కిందపడి మృతిచెంది ఉంటాడన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై మధిర రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. తమ కుమారుడి మృతిపై తమకు ఎవరిపై అనుమానాలు లేవని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు.

పత్తి రైతు కుదేలు

» క్వింటా ధర రూ.4500లు పలుకుతున్న వైనం » తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



జూలూరుపాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో తెల్ల బంగారం సాగు చేపట్టిన రైతులకు నిరాశే ఎదురవుతుంది. ఈ ఏడాది అధిక వర్షాలు రైతులను నిండా ముంచాయి. దీంతో ఆప్రభావం పంట దిగుబడులపై పడింది. పత్తి చేలు ఎర్రబారి ఎండిపోతుండడంతో రైతులు అందోళనకు గురవుతున్నారు.. ప్రస్తుతం చేతికి అందిన కొద్దిపాటి పంటను అమ్మటానికి తీసుకువచ్చిన రైతులు ధరను చూసి నిరాశ చెందుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ధర తమకు గిట్టుబాటు కాదని వాపోతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని, ఎకరానికి 5క్వింటాలలోపే దిగుబడులు రావడం గగన మవుతుందని రైతులు అంటున్నారు. కాగా ప్రభుత్వం ఈ ఏడాది తెల్ల బంగారానికి క్వింటాకు రూ.8110ల మద్ధతు ధరను ప్రకటించింది. కానీ ప్రస్తుతం జూలూరుపాడులో కొందరు ప్రైవేట్ వ్యాపారులు పత్తి క్వింటా రూ.4500ల ధరకే కొనుగోలు చేస్తుంతండడంతో రైతులు కుదేలవుతున్నారు. అధిక వర్షాలతో పత్తి నల్లబడి నాణ్యత లోపించిందని, నిమ్ముశాతం ఎక్కువగా ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రారంభంలోనే ధర ఇలా ఉంటే ముందుమందు మరింత దిగజారుతుందోనని రైతులు అందోళన చెందుతున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసే ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. తమకు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర లభించడం లేదని, నాణ్యత లోపించిందనే సాకును చూపి వ్యాపారులు మరింత తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేయడం తగదని రైతులు అంటున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మంలీగల్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓల్డ్‌క్లబ్ ప్రాంతానికి చెందిన నిందితుడు బెజ్జమ్ విజయ్ కుమార్‌కు ఏడాది జైలు శిక్ష విధించారు. అంతేకాక బాధితుడికి రూ.18లక్షలు నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని శుక్రవారం తీర్పు చెప్పారు. ఖమ్మం పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన కంచర్ల రాజేంద్రప్రసాద్ వద్ద నిందితుడు 2013లో రూ.20లక్షలు అప్పుగా తీసుకున్నాడు. రుణదాత ఒత్తిడి మేరకు అదే ఏడాది రూ.18లక్షలకు చెక్కు జారీ చేశాడు. ఫిర్యాదిదారుడు ఆచెక్కును బ్యాంకులో జమ చేయగా నిందితుడి ఖాతాను మూసివేసుకున్నాడని బ్యాంకు వారు మెమో ఇచ్చారు. అనంతరం ఆయన కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. సాక్షులను విచారణ జరిపిన అనంతరం నేరం రుజువు కావడంతో ఈ తీర్పు చెప్పారు.

పక్షం రోజుల్లో ఖమ్మం రూపురేఖలు మారాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పక్షం రోజుల్లో ఖమ్మం నగరం రూపురేఖలు మారాలని, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన నగరంగా మార్పులు రావాలని, ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుద్య జవాన్లు పనితీరులో మార్పు రాకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పారిశుద్య జవాన్లు, శానిటరి ఇన్స్‌పెక్టర్లు, పారిశుద్య విభాగం అధికారులతో నేరుగా రివ్యూ నిర్వహించారు. ఈనెల 13 నుంచి నగరంలో ప్రత్యేక పారిశుద్య డ్రైవ్ చేపట్టాలని ప్రధాన రహదారులను పరిశుభ్రంగా చేయాలని, రహదారుల పక్కన దుమ్మును క్లీన్ చేయాలని ఆదేశించారు. డ్రైయినేజీలను శుభ్రం చేయాలని జవాన్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ వరకు ప్రత్యేక డ్రైవ్‌ను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. నగరంలో ఖాళీ స్థలాల యజమానులకు కఠినమైన నోటీసులు జారీ చేయాలని ఎవ్వరైనా మాట వినకుంటే వారి ఖాళీ స్థలాలను ప్రత్యేకంగా నమోదు చేసి నిభందనల మేరకు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. జవాన్లు వారీగా రోజు పనితీరును తనకు తెలియజేయాలని ఆదేశించారు. ఆకస్మీక తనిఖీలు తాను కూడా చేస్తానన్నారు. ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా సెలవ్‌లు రద్దు చేయాలని, పది రోజులు పాటు ప్రత్యేక గ్యాంగ్ వర్క్ చేపట్టాలని కోరారు. వ్యాపార సంస్థలు, హోటల్స్, రెస్టారెంట్లు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వదిలితే వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని హెచ్చరించారు.

భద్రాద్రి జిల్లా ఖోఖో జట్టుకు కొమరారం విద్యార్థిని


పవిత్ర

ఇల్లెందురూరల్, అక్టోబరు10(ఆంధ్ర జ్యోతి): ఇల్లెందు మండలం కొమరారం ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బూరుగడ్డ పవిత్ర అండర్-14 జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైంది. గురువారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఖమ్మంలో జరిగే ఉమ్మడి జిల్లాల స్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు జిల్లా జట్టు తరఫున ప్రతినిధ్యం వహించనుంది.జిల్లా జట్టుకు ఎంపికైన పవిత్రను కొమరారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, పీఈటీ రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్నది బీజేపీ, బీఆర్ఎస్‌లే

» బీసీలకు ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది
» టీపీసీసీ సభ్యుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని టీపీసీసీ సభ్యులు, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరీ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి 42 శాతం బీసీ రిజర్వేషన్లు రూపొందించినట్లు గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం బీసీల రిజర్వేషన్‌కు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్న సమయంలో కోర్టు తీర్పు ఊహించలేదన్నారు. అగ్ర కులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే సమయంలో తాము అడ్డుకోలేదని, బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే అడ్డుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీ, ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జి వీరాపురం రాంలక్ష్మణ్, ఎన్ఎస్‌యుఐ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సురేష్‌నాయక్, నాయకులు ఈశ్వర్‌సింగ్, మోరే రమేష్, షేక్ నిసార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేబీ శౌరీ

ప్రాణాలు పోయాక పట్టించుకుంటారా?

» జాతీయ రహదారిపై బైటాయించి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పూర్ణ

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి)గుంతలమయంగా మారిన లక్ష్మీదేవిపల్లి మొర్రెడు వాగు పాత వంతేనకు మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి లావుడ్యా పూర్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జాతీయ రహదారి మొర్రేడు వంతెనపై బైటాయించి ప్రాణాలుపోయాక పట్టించుకుంటారా అంటూ ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేశారు. నిత్యం వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో వంతెనపై గుంతలు అనే వార్తను ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనప్పటికీ నేషనల్ హైవే అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోకపోవడంతో పూర్ణ నిరసనకు దిగాడు.

మూడేళ్లుగా విడుదల కాని నిధులు.. భారంగా పాఠశాలల నిర్వహణ

» పేద విద్యార్థులకు తప్పని తిప్పలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల నుంచి ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక భారంతో పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను తరగతి గదులకు అనుమతించలేమని చెబుతూ శుక్రవారం సత్తుపల్లిలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. గత 9ఏళ్ల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథం కింద సత్తుపల్లిలో సీటు సంపాదించిన 80మంది పేద, గిరిజన విద్యార్థుల భవిష్యతు ప్రశ్నార్థకంగా మారనుందని వాపోయారు. అంతే కాక ఉపాధ్యాయులకు జీతభత్యాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని, ఇదే విషయాన్ని ఎన్నిమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని, ప్రభుత్వమే తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న స్కూల్స్ నిర్వాహకులు

జాతీయస్థాయిలో అవధానిగా ప్రథమస్థానం సాధించిన రుత్విక్‌శర్మ

వైరా, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైరాలోని శ్రీసత్యసాయి వేద పాఠశాల వేదపండితులైన దుర్భాకుల కుమార్‌శర్మ, రాధికా కామేశ్వరి దంపతుల కుమారుడు బుత్విక్‌శర్మ జాతీయ స్థాయిలో పలు వేద పరీక్షల్లో పాల్గొని అవధానిగా ప్రథమస్థానం పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుత్విక్‌శర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, చెరుకూరి శ్రీనివాసరావు, చింతోజు నాగేశ్వరరావు, అబ్బూరి రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


రుత్విక్‌ను సన్మానిస్తున్న కాపా మురళీకృష్ణ

వరిలో సుడిదోమ .. నివారణ చర్యలు

ఎర్రుపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో రైతులతో వరి పైరులో సుడిదోమ బెడద నుంచి నివారణ పొందవచ్చని మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణిదేవీ అన్నారు. మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం, మీనవోలు, బనిగండ్లపాడు గ్రామాలలో శుక్రవారం ఆమె పర్యటించి వరి, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలాచోట్ల వరి పైరు చిరుపొట్టదవనుంచి పాలు పోసుకునే దశలో ఉన్నాయని ఈ దశలో నుంచే దోమ వ్యాపించే అవకాశం ఉందన్నారు. పొలంను ఆరబెట్టుకుని వ్యవసాయ అధికారుల సిఫార్సుతో ఎసీఫేట్ 1.5గ్రామాలు ప్రయిమోజెన్ 0.6.గ్రాములు లీటీరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పోషక లోపంకు మల్టీకే 19-19-19, పై ముడతకు పిప్రాణి 400 మిల్లీలు ఎకరానికి తగునీటిలో కలిపి పిచికారి చేయాలని కోరారు. కీటక శాస్త్రవేత్త కె.నాగస్వాతి, ఏవో సాయిశివ, ఏఈవోలు సింధూర్, గోపి, వెంకటేష్ పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

క్రీడలతో బంగారు భవిష్యత్

● రాష్ట్రస్థాయి టీటీ పోటీల ప్రారంభంలో ఎంపీ రఘురాంరెడ్డి
● అన్ని జిల్లాల నుంచి క్రీడాకారుల రాక

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని టీటీ ఇండోర్ హాల్‌లో నిర్వహించిన బాలసాని సన్యాసయ్య మెమోరియల్ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నీస్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు, క్రీడా వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రీడాకారులు గెలుపోటములు పట్టించుకోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నగరంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 325మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ సెక్రెటరీ నాగేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, సాంబమూర్తి, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, రవిమారుత్, డాక్టర్లు ప్రవీణ్, శశికుమార్, సుమంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ఢీ

● 30మందికి గాయాలు
● అతి వేగమే ప్రమాదానికి కారణం
● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన

బూర్గంపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో.. అందులో ప్రయాణిస్తున్న 30మందికి గాయాలైన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు శుక్రవారం భద్రాచలం నుంచి ఖమ్మానికి వెళ్తుంది. అలాగే కొత్తగూడెం డిపోకు చెందిన బస్సు భద్రాచలం వస్తుండగా.. మార్గమధ్యలో బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల మూల మలుపు వద్ద రెండు బస్సులు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో రెండు బస్సుల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో రెండు బస్సుల డ్రైవర్లతో పాటు 30మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలపడంతో.. అధికారులు, బాధిత కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఆర్టీసీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ప్రమాదానికి గురైన వాహనాలు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఘటనపై ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఢీకొన్న రెండు ఆర్టీసీ బస్సులు

దక్షిణ అయోధ్యగా భద్రాద్రి అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

ఆధ్యాత్మిక కేంద్రంగా, దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏ పనిలోనూ నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. భద్రాద్రికి వచ్చే ఆదాయం, వసతి, పార్కింగ్, నీటి సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు నిరంతరం భద్రాచలం వచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం ఉండకూడదని, సమయపాలన ప్రకారం జరిగేలా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తయిన తర్వాత విశాలమైన యజ్ఞశాల, రామకోట మాడ వీధులు, ఆధునిక కట్టడాలతో కొత్త చరిత్ర కనిపించేలా పనులు ఉండాలన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక పునరుజ్జీవానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, భక్తుల నమ్మకం కాపాడేలా దేవాదాయశాఖ పకడ్బందీగా పని చేయాలని సూచించారు.

ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇందుకు అవసరమైన మూడు స్థలాలను జిల్లా అధికారులు ప్రతిపాదించారన్నారు. టీటీడీ అధికారుల బృందం ఖమ్మానికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థలాన్ని ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. కొత్తగా టీటీడీ ఆలయం నిర్మాణం పూర్తయితే ఖమ్మం జిల్లా ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి సాధిస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ సమీక్షలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సురేందర్‌రెడ్డికి పొంగులేటి శుభాకాంక్షలు


మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పొంగులేటి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు రామసహాయం సురేందర్ రెడ్డి 94వ జన్మదినాన్ని శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిపొంగులేటి పూల బోకే అందజేసి సురేందర్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని ప్రశంసించారు. ఆయన దీర్ఘాయుష్మాన్ కావాలని, ఆరోగ్యంగా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.

ఏఐతో ఘరానా మోసం

(5వ పేజీ తరువాయి)

వీడియో కాల్స్ విషయం బయటపడింది. దీంతో పోలీసులు విషయాన్ని దేవినేని ఉమా దృష్టికి తీసుకెళ్లడంతో.. తాను ఎవరికి వీడియో కాల్ చేయలేదని స్పష్టం చేశారు. ఇలాంటి కాల్స్ పార్టీకి సంబంధించిన వారెవరూ చేయరని చెప్పడంతో మోసం బట్టబయలైంది. తాము ఏఐ సాంకేతికను ఉపయోగించి చేసిన వీడియో కాల్స్ వల్ల మోసపోయామని తెలుసుకున్న టీడీపీ అభిమానులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

టీజీ, ఏపీ నిఘా వర్గాల ఆరా

చంద్రబాబు, దేవినేని ఉమా వీడియో కాల్స్‌ను కృత్రిమ మేథను ఉపయోగించి మోసగించిన వ్యక్తి ఎవరు అనే విషయమై అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోని నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఏ విధంగా టీడీపీ అభిమానులను మోసగించారు!? గతంలో కూడా ఇలాంటి సంఘటనలు ఏమైనా ఉన్నాయా!? అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. సత్తుపల్లి మండలం నుంచి బాధితులు విజయవాడకు ఎవరెవరు వెళ్లారనే సమాచారాన్ని కూడా నిఘా వర్గాలు సేకరిస్తున్నాయి. జరిగిన మోసానికి సంబంధించి వెంటనే రంగంలోకి దిగిన నిఘా వర్గాలు ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఈ మోసానికి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. మొత్తమ్మీద మోసపోయిన టీడీపీ అభిమానుల సంఘటన ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో వైరల్‌గా మారింది.

అర్ధరాత్రి ప్రార్థనామందిరాన్ని ధ్వంసం చేసిన అగంతకులు

» విచారణ నిర్వహించిన తహసీల్దార్

బోనకల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రార్థనామందిరాన్ని ధ్వంసం చేయడంతోపాటు క్రీస్తూ శిలువను దగ్గరలో ఉన్న బీటీసీలో పడవేశారు. ప్రార్థనామందిరాన్ని ధ్వంసం చేసిన సంఘటన మండలంలో కలకలం రేపింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొత్తపల్లి సంపూర్ణ గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో రేకుల షెడ్ వేసుకొని అందులోనే ప్రార్థన చేసుకుంటామని ఆయన కుమారుడు రాంబాబు తెలిపాడు. రోజువారీ ప్రార్థనలు చేసుకోవడంతోపాటు సిమెంట్ పిల్లర్‌తో క్రీస్తూ శిలువను కూడా అక్కడే ఏర్పాటుచేసుకున్నారు. పర్వదినాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడంతో ప్రజల రాకపోకలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి గ్రామశివారు ప్రాంతంలో ఉన్న ప్రార్థనామందిరాన్ని ధ్వంసం చేయటం వెనుక పెద్ద కుట్రదాగి ఉందని బాధితుడు రాంబాబు ఆరోపించాడు. దాంతో తహసీల్దార్ ఎం.రమాదేవి, రెవెన్యూ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని విచారణ నిర్వహించారు. ఈ సంఘటనను పాస్టర్ల పెలోషిప్ నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రార్థనామందిరాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.


దుండగులు ధ్వంసం చేసిన మందిరాన్ని పరిశీలిస్తున్న అధికారి

బీటలు వారుతున్న
కేటీపీఎస్ సొసైటీ



కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని సొసైటీ కార్యాలయం

- పారదర్శకతను గాలికొదిలేసిన గత పాలకులు
- నిందలు మోయడానికి సిద్ధమవుతున్న నూతన పాలకులు
- హైకోర్టుకు చేరిన సొసైటీ వివాదం
- అయోమయ స్థితిలో ఫిక్స్‌డ్ డిపాజిట్‌దారులు

పాల్వంచ అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సభ్యుల నమ్మకం అనే పునాదులపై నిర్మితమైన పాల్వంచ కేటీపీఎస్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కోట బీటలు బారుతుంది. గత పాలకులు చేసిన తప్పిదాల ఫలితాన్ని నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలకులు మోయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. కానీ ప్రస్తుతం సొసైటీలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో సభ్యులు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌దారులు సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతుండగా ఏకంగా సొసైటీ భవిష్యత్తుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొసైటీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కేటీపీఎస్ కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులు 1989లో ఏర్పాటు చేసుకున్న కేటీపీఎస్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రి. నెం.189-టీఈఈ. క్రమంగా అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలో ఏ థర్మల్ స్టేషన్‌లో లేని విధంగా రూ.130 కోట్ల టర్నోవర్ కలిగిన సొసైటీగా విరాజిల్లుతుంది. అదే సమయంలో బీటీపీఎస్, యాదాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణంతో కార్మికుల కొరత ఏర్పడి అక్కడకు పాల్వంచ కేటీపీఎస్ నుంచి 897మంది కార్మికులు వలస వెళ్లారు. ఆయా థర్మల్ స్టేషన్లకు వెళ్లిన కార్మికులకు వెసులుబాటు కోసమంటూ అలనాటి పాలకులు తీసుకున్న తప్పుడు తీర్మానాలతో ఆ రెండు పవర్ ప్లాంట్ల కార్మికులు, ఉద్యోగులు, ఇంజనీర్లను కో ఆపరేటివ్ రూల్స్‌కు విరుద్ధంగా పాల్వంచ సొసైటీ గొడుగు కిందకు చేర్చారు. అంతే కాక ఏడుగురు డైరెక్టర్ల సంఖ్యను ఆమాంతం 13కు చేర్చారు. దీంతో అప్పటి నుంచి పాల్వంచ బీటీపీఎస్, వైటీపీఎస్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీగా కొనసాగుతుంది. దీంతో పాలకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా సొసైటీ మారిపోయింది. పాల్వంచ సొసైటీపై పూర్తి అవగాహన లేని జిల్లా కో- ఆపరేటివ్ అధికారి కమిటీ వారు ఏ నిర్ణయం తీసుకున్నా వారికి వత్తాసు పలకడం పరిపాటిగా మారింది. నిబంధనల ప్రకారం ఎక్కడైనా కార్మికులు వందమంది కలసి సొసైటీ ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ కేవలం ఇద్దరు కీలకమైన వ్యక్తులు పావులు కదిపారు. వైటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న వారిరువురూ డబ్బులను వెదజల్లి సొసైటీ పాలకవర్గ ఎన్నికల్లో గెలుపొంది కీలక బాధ్యతలు చేపట్టారు. దాన్ని సాకుగా చూయించి తమ పర్యవేక్షణ పాల్వంచలో తప్పని సరి అని, చెక్ పవర్ కలిగిన తమను కేటీపీఎస్‌కు బదిలీ చేయాలని అభ్యర్థిస్తూ జెన్కో ఉన్నతాధికారుల నుంచి డిప్యూటేషన్ ఆర్డర్ పొందారు. దాంతో మరింత ముందుకెళ్లి సొసైటీ రూల్స్‌ను బ్రేక్ చేయడం ప్రారంభించారని, అందులో భాగంగా బయట వ్యక్తుల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరించారని, కార్మికుల కుటుంబ సభ్యుల నుంచి డిపాజిట్లు సేకరించారని, వడ్డీ వ్యాపారంసైతం నిర్వహించారని, అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సిన రిజర్వ్‌డ్ ఫండ్ రూ. కోట్లను సొంత ఖర్చులకోసం, తమ ఆర్థిక పరమైన రొటేషన్ కోసం వినియోగించారనే వదంతులు జెన్కో వ్యాప్తంగా వ్యాపించాయి. అంతే కాక తమ ఖర్చుల కోసం సొసైటీ నిధులు పక్కదారి పట్టించారని, ఆడిట్‌కు ముందు మాత్రం ఏమీ తెలియనట్లుగా సొసైటీ ఖాతాలో ఆ డబ్బును జమ చేసేవారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే కొందరు జిల్లా కలెక్టర్‌ను కలసి సొసైటీ జమా ఖర్చులపై తమకు అనుమానాలు ఉన్నాయని, అట్టి వివరాలను తమకు ఇప్పించాలని ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతే కాక తాజాగా మరికొంత మంది వైటీపీఎస్‌కు చెందిన సభ్యులను పాల్వంచ సొసైటీలో చేర్చడం నిబంధనలకు వ్యతిరేకమని, వారిని పాల్వంచ సొసైటీ నుంచి తప్పించాలని కోరుతూ హైకోర్టులో ఆగస్టు 21న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో డిపాజిట్‌దారులు పాలకవర్గం వద్ద పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది.

ఈ విషయాలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఒకే కాంప్లెక్స్‌లో ఉన్న, ఒకే సంస్థకు చెందిన వందమంది ఉద్యోగులు ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని ఏర్పాటు చేసుకోవచ్చునని అన్నారు. వైటీపీఎస్‌కు చెందిన సభ్యులను కేటీపీఎస్ సొసైటీ నుంచి తొలగించాలని కోరుతూ హైకోర్టులో కేసు కొనసాగుతున్న మాట వాస్తవమేనని అన్నారు.

సమాచార హక్కు చట్టం శక్తివంతమైన సాధనం

- అన్ని శాఖల సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి: కలెక్టర్ జితేష్ వి పాటిల్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల పరిరక్షణకు సమాచార హక్కు చట్టం శక్తివంతమైన సాధనమని...ప్రభుత్వ పారదర్శకతను పెంపొందించేదుకు అన్ని శాఖ ల సమగ్ర సమాచారం ఆన్‌లైన్ లో జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు శక్తినిచ్చే చట్టం అన్నారు. ఇది ప్రభుత్వ పారదర్శకతను పెంపొందించి, అధికారిక యంత్రాంగంలో జవాబుదారి తనాన్ని నెలకొల్పుతుందన్నారు. సమాచారం సకాలంలో ప్రజలకు అందించడం ద్వార పరిపాలన విశ్వసనీయతన పెరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సేవలు, నిర్ణయాలు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. ప్రజల దరఖాస్తులపై సానుకూలంగా స్పందించాలని కోరారు. అన్ని శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించి అసరమైన శిక్షణా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, పారదర్శకత, జవాబుదారి తనం పాటిస్తూ విధులను నిర్వహిస్తామని ప్రతిజ్ఞచేయించారు. ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీఓ సంజీవరావు, వ్యవసాయ అధికారి బాబురావు, వైద్యాధికారి జయలక్ష్మీ, డీసీఓ రుక్మిణీ, బీసీ సంక్షేమశాఖాధికారి విజయలక్ష్మీ, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అధికారిక గుర్తింపు

- వ్యాపారం చేస్తున్న వారి నుంచి డిపాజిట్ల సేకరణ
- ఒక్కో కూరగాయల దుకాణానికి రూ.10వేల డిపాజిట్
- ప్రకటించిన మెప్మా, మార్కెటింగ్ అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా గుర్తింపు లేని వీధి వ్యాపారులకు ఇక మీదట అధికారికంగా గుర్తింపు రానుంది. ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో గత నెల రోజులుగా సమూల మార్పుల చర్యలు ప్రారంభించారు. కాగా శుక్రవారం వీధి వ్యాపారులకు అధికారికంగా గుర్తింపు ఇచ్చేందుకు కావాల్సిన నిభందనలను మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ ఈవో శివరామకృష్ణ పోలీసుల భద్రత నడుమ ప్రకటించారు. ఇప్పటికే డిజిటల్ సర్వేతో 200లకు పైగా కూరగాయల దుకాణాలను అధికారులు గుర్తించారు. వాటిని మూడు విభాగాలకు కేటాయించారు. కూరగాయల వ్యాపారం అధికంగా జరిగే దుకణాలు, మధ్యస్థ అమ్మకాలు, తక్కువగా అమ్మకాలు జరిపే దుకాణాలను గుర్తించారు. కాగా వీధి వ్యాపారుల దుకాణంలో వ్యాపారం చేసేందుకు డిపాజిట్‌ను అధికారులు ప్రకటించారు. ప్రతి వ్యాపారి రూ.10వేలు డిపాజెట్‌గా చెల్లించాలని ఆ డిపాజిట్ డబ్బులను నిభందనల మేరకు వీధి వ్యాపారుల ప్రాంగణం మార్కెట్ అభివృద్ధికి మాత్రమే బ్యాంకులో జమ చేయటం జరుగుతుందని, వీధి వ్యాపారుల మార్కెట్‌లో వ్యాపారం చేయదల్చిన వారు మూడు రోజులు లోపుగా రూ.10వేలు డిపాజిట్‌తో పాటుగా ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు ఇవ్వాలని సూచించారు. శనివారం నుంచి డిపాజిట్‌లు స్వీకరణ ఉంటుందన్నారు. వీధి వ్యాపారుల మార్కెట్‌లో ఇప్పటి వరకు వ్యాపారం చేసే వారికే మాత్రమే ప్రస్తుతం అవకాశం కల్పించినట్లు అధికారులు ప్రకటించారు.



మాట్లాడుతున్న గుడిపూడి సుజాతరాణి

ఒకే కాన్పులో మూడు పిల్లలకు జననం



బూర్గంపాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన కామిరెడ్డి వెంకటరెడ్డికి చెందిన ఓ గొర్రె శుక్రవారం తెల్లవారుజామున ఒకే కాన్పులో మూడు పిల్లలకు జన్మనిచ్చింది. మూడు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయని యాజమాని తెలిపారు. సాధారణంగా ఒకే కాన్పులో ఒకటి లేదా రెండు పిల్లలకు జన్మనిస్తాయని పశుపోషణదారులు పేర్కొంటున్నారు. మూడు పిల్లలకు జన్మనివ్వడం అనేది చాలా అరుదైన ఘటనగా పరిగణిస్తున్నారు. తమ ఫామ్‌లోని గొర్రె ఒకే కాన్పులో మూడు పిల్లలకు జన్మనివ్వడం చాలా సంతోషంగా ఉందని యాజమాని వెంకటరెడ్డి తెలిపారు.

టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలీ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబరు 15 లోపు దరఖాస్తు సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముజాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి బాయ్స్ నందు జనరల్ టీజీటీ ఇంగ్లీష్, నేలకొండపల్లి బాయ్స్ నందు జనరల్ జేఎల్ మ్యాథ్స్, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల నందు మ్యాథ్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ పోస్టులు, వైరా గర్ల్స్ నందు పిజిటి ఇంగ్లిష్, ఖమ్మం గర్ల్స్ నందు ఫిజికల్ డైరెక్టర్ పోస్ట్ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జేఎల్, పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీ 50 శాతం మార్కులతో పాటు బీఈడీలో 50 శాతం మార్కులు, టీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టు గ్రాడ్యుయేషన్, బీఈడీలో 50 శాతం మార్కులతో టెట్ తప్పని సరి అని, బోధన అనుభవం 3 సంవత్సరాలు ఉండాలని, అభ్యర్థులు ఖమ్మం జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు అక్టోబరు 15 లోపు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అనంతరం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని తెలిపారు. నియామకాలు పూర్తిగా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తాత్కాలికంగా ఉంటాయని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గుండెపోటుతో యువ రైతు మృతి



వాంకుడోత్ రవి(ఫైల్)

ఇల్లెందురూరల్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): వరి పొలానికి మందు కొడుతూ గుండెపోటుకు గురై యువరైతు మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండలం రేపల్లేవాడ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రేపల్లేవాడ గ్రామానికి చెందిన వాంకుడోత్ రవి(35) తన పొలంలో క్రిమిసహారక మందు కొడుతుండగా గుండెపోటుకు గురై పొలంలోనే సొమ్మసిల్లాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అతడిని ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న రవి మృతదేహాన్ని పరిశీలించి అతడి కుటుంబాన్ని ఓదార్చారు.

సైబర్ మోసంతో నగదు స్వాహా

దుమ్ముగూడెం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాని చేతిలో పెదనల్లబల్లికు చెందిన మట్టా శేఖర్ రూ.22,400లు నగదు కోల్పోయాడు. ఈ నెల 8న తనకు తెలియకుండా భద్రాచలం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రా అయ్యింది. తన ఖాతాను హ్యాక్ చేశారని బాధితుడు శేఖర్ శుక్రవారం సైబర్‌క్రైం విభాగానికి ఆన్‌లైన్లో ఫిర్యాదు చేశాడు.

వ్యక్తిపై మద్యం సీసాతో దాడి

చుంచుపల్లి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మద్యం సీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన శుక్రవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన మధుకర్ ఇంటికి వెళుతూ మార్గమధ్యలో మద్యం సేవిస్తున్న యువకులను మద్యం ఎందుకు తాగుతున్నారని మందలించాడు. ఈ క్రమంలో ఆగ్రహించిన యువకులు అతడిపై బీరు సీసాతో దాడి చేశారు. బాధితుడు పోలీసులను ఫిర్యాదు చేయగా పోలీసులు దాడికి పాల్పడిన రుద్రాక్ష అనే యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ప్రతాప్ తెలిపారు.

బంగారు ఉంగరాలు దొంగిలించిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): బంగారు ఉంగరాలు దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 3న పోస్టాఫీస్ సెంటర్ వద్ద మద్యం మత్తులో ఉన్న నర్సయ్య అనే వ్యక్తిని సబ్బరపు ప్రవీణ్, సబ్బరపు వరుణ్ అనే ఇద్దరు వ్యక్తులు ఒక కిరాయి ఆటోని ఆపి ఎక్కించారు. ఎవరికి అనుమానం రాకుండా నర్సయ్యను ఇంటి వద్ద దింపాలని రామవరం బ్రిడ్జి వద్ద ఆపివేసి అతని వేలుకి ఉన్న రెండు బంగారు ఉంగరాలు లాక్కొని పరారయ్యారు. ఈ నెల 8న బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బంగారు ఉంగరాలు దొంగిలించిన ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి

పినపాక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ అంగన్‌వాడీ ఆయా మృతి చెందిన ఘటన మండలంలోని గడ్డంపల్లిలో జరిగింది. పినపాక సెక్టార్‌లోని గడ్డంపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న ఆయా పాయం బుల్లెమ్మ (52) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. కాగా నాలుగు రోజులుగా జ్వరం వస్తున్న క్రమంలో స్థానికంగా వైద్యం పొందిందని, శుక్రవారం మృతి చెందిందని బంధువులు తెలిపారు. ఆమె మృతి పట్ల ఐసీడీఎస్ సీడీపీవో జయలక్ష్మీ, సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్వాడీ టీచర్లు, సంతాపం తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

దమ్మపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనంపై వెళుతూ యువకుడు పోలీస్ సైరన్ వినియోగించండంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అశ్వారావుపేట మండలం దురదపాడు గ్రామానికి చెందిన కుంజా చందూ(19) అనే యువకుడు ద్విచక్రవాహనాన్ని అతి వేగంగా డ్రైవ్ చేస్తూ అచ్యుతాపురం క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం ప్రజలను అందోళన పరిచే విధంగా పోలీస్ సైరన్ వినియోగించాడు. ఈ ఘటనపై బ్లూకోట్ కానిస్టేబుల్ బాలకృష్ణ, ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేశారు.

పునాది గోతిలో పడి బాలుడి మృతి

● దుమ్ముగూడెం మండలంలో ఘటన



అక్షయ్‌కుమార్ మృతదేహం

దుమ్ముగూడెం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పక్కింటి పునాది గోతిలో పడి రెండేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామానికి చెందిన తుష్టి సురేష్, అమ్మోజీల కుమారుడు అక్షయ్‌కుమార్ (2). రోజూలాగే శుక్రవారం ఉదయం సురేష్ పొలం పనులకు వెళ్లగా.. తల్లి అమ్మోజీ ఇంటి పనుల్లో ఉంది. ఈ క్రమంలో అక్షయ్‌కుమార్ ఆడుకుంటూ వెళ్లి.. ప్రమాదవశాత్తూ ఇంటి పక్కనే గల వేరొకరి ఇందిరమ్మ ఇంటి పునాది గోతిలో పడ్డాడు. కొంతసేపటి తర్వాత కొడుకు ఆరా కోసం పరిసరాల్లో తల్లి వెతుకుతుండగా.. వర్షపు నీటితో నిండిన పునాది గోతిలో తేలుతూ కనిపించాడు. బాలుడిని బయటకు తీసి నరసాపురం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి సుభాష్ సీపీఆర్ చేసినప్పటికీ ప్రయోజనం కనబడలేదు. అప్పటికే బాలుడు మృతిచెందాడని వైద్యాధికారి ధ్రువీకరించారు. పన్నెండేళ్ల తర్వాత లేక లేక కలిగిన కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా.. తమ కొడుకు చావుకు మీరే కారణమంటూ పునాది గోతిని తీసి నిర్లక్ష్యంగా వదిలేసిన వారితో మృతుడి కుటుంబీకులు గొడవకు దిగారు.

సత్తుపల్లిలో కాపర్ వైర్ల చోరీ



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను ఎంచక్కా చోరీ చేస్తున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ శాఖ గంగారం ఏఈ కావ్య తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి మండలంలోని పలువురికి చెందిన వ్యవసాయ క్షేత్రాలలోని ట్రాన్స్‌ఫార్మర్లను కిందపడేసి అం దులోని కాపర్ వైర్లను చోరీ చేస్తున్నారని, ఇదే విషయమై సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. గతనెల 9న రుద్రాక్షపల్లిలోని దాసరి ప్రతాపరెడ్డి (25కేవీఏ), 13న రామానగరంలోని గుర్రాల కృష్ణారావు (25కేవీఏ), ఈనెల 3న రుద్రాక్షపల్లిలోని సీహెచ్.శ్రీనివాసరావు, వెంకట సరోజిని (16కేవీఏ), కాకర్లపల్లి రోడ్డులో పాటి బండ్ల ఉమామహేశ్వరరావు (25కేవీఏ), 9న రామానగరంలో బొంతు నాగేశ్వరరావు (25కేవీఏ)లకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరు చోరీకి గురవ్వగా విద్యుత్ శాఖకు రూ.2లక్షల ఆస్తినష్టం ఏర్పడిందని ఆమె తెలిపారు. ఈ దొంగతనాలతో రైతులు ఆందోళన చెందుతున్నామని, పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ధ్వంసంమైన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

అటవీశాఖలో అలజడి

- బీట్ ఆఫీసర్ ఫోన్ పే వివరాలు సేకరించిన విజిలెన్స్
- ఓ కీలక అధికారిపై వేటుకు రంగం సిద్ధం

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో అక్రమ పర్మిట్లు అవినీతి డొంక రోజు కో మలుపు తిరుగుతుంది. ఇప్పటి వరకు ఖమ్మం డివిజన్‌కే పరిమితమైన అవినీతి భవిష్యత్‌లో జిల్లాలోని ఇతర అటవీ డివిజన్లకు వ్యాపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యం గా అక్రమ పర్మిట్లు మంజూరులో కీలకంగా క్షేత్రస్థాయిలో వ్యవహరించి తొలి సస్పెన్షన్ వేటుకు గురైన బీట్ ఆఫీసర్ సెల్ ఫోన్ నుంచి రాష్ట్ర విజిలెన్స్ అధికారులు పూర్తి స్థాయి సమాచారాన్ని రాబట్టుతున్నారు. ఈ క్రమంలోనే బీట్ ఆఫీసర్ సెల్ ఫోన్‌లోని ఫోన్ పే లావాదేవీలను రాష్ట్ర విజిలెన్స్ అధికారులు గుర్తించారని సమాచారం. బీట్ ఆఫీసర్ సెల్‌ఫోన్ నుంచి అటవీశాఖలోని ఏ ఏ అధికారులు, ఉద్యోగులకు ఆర్థిక లావాదేవిలు జరిగాయి, అనే విషయం విచారణ జరగగంతో డబ్బులు పొందిన అధికారులు, ఉద్యోగుల్లో అలజడి నెలకొంది..

అక్రమ పర్మిట్లు వ్యవహారంలో పర్యవేక్షణా లోపంతో వ్యవహరించిన లేదా పరోక్షంగా సహకరించిన ఓ కీలక రేంజ్ అధికారిపై చర్యలకు రాష్ట్ర స్థాయి అధికారులు ఫైల్ పూర్తి చేశారని సమాచారం. నేడు రేపో ఆ అధికారిపై వేటు పడే ఆదేశాలు వస్తాయని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అటవీశాఖలో తీవ్రమైన చర్చ జరిగింది.

రోడ్డు ప్రమాదంలో బాలుడు, బాలిక మృతి

● మరో బాలుడి పరిస్థితి విషమం

ముదిగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు, బాలిక మృతి చెందగా.. మరో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన పెద్దమండవ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దమండవ గ్రామానికి చెందిన పేరం బుచ్చిబాబు, మాణిక్యమ్మ దంపతుల కుమారుడు పేరం ప్రవీణ్(14), ఇతను గ్రామంలో 9వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన గొర్రెముచ్చు యావన్ కుమార్తె సనా(9) నాల్గో తరగతి చదువుతుండగా.. గొర్రెముచ్చు సాయి ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యనభ్యసిస్తున్నాడు. వీరిద్దరూ అన్నాచెల్లెళ్లు. అయితే శుక్రవారం రాత్రి వీరు ముగ్గురూ కలిసి సాయి బైక్‌పై పెద్దమండవ వైపు నుంచి బాణాపురానికి బయలుదేరాడు. మార్గ మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పేరం ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సనాను, సాయిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో సనా మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సాయిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సాయి పరిస్థితి కూడా విషమంగా ఉంది. ప్రవీణ్ తల్లిదండ్రులు ఏపీలోని పెద్దమొదుగుమల్లి నుంచి వలస వచ్చి పెద్దమండవ గ్రామంలో గత ఆరు సంవత్సరాలు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సనా తండ్రి యావన్ గ్రామంలో ఓ రైస్‌మిల్లులో కూలీ పని చేస్తూ పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు. సంఘటనాస్థలాన్ని సీఐ మురళి సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాగా.. ప్రమాద ఘటనపై గ్రామస్థులు, కుటుంబీకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బైక్‌పై ముగ్గురూ వెళ్లగా.. అతి వేగంతో ప్రమాదం జరిగిందా !? లేదా ఏదైనా వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టిందా !? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయి పూర్తిస్థాయిలో కోలుకుంటేనే ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం వెలుగు చూసే అవకాశం ఉంది.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ భీమా నాయక్



క్రీడాజ్యోతిని అందిస్తున్న భీమానాయక్

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఉద్యోగుల్లో శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెంపొందిస్తూ క్రీడాస్ఫూర్తిని నింపేందుకే క్రీడలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ వి.భీమానాయక్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో భద్రాద్రి సర్కిల్ పరిధిలో అటవీ క్రీడా సమ్మేళనం-2025 క్రీడలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, చెస్, సైక్లింగ్, రన్నింగ్ తదితర విభాగాల్లో క్రీడలు జరిగాయి. ఈ క్రీడల్లో భద్రాద్రిజిల్లా, మహబూబాద్, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాలకు చెందిన అటవీశాఖ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 17, 18 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలకు హాజరుకానున్నారని అధికారులు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు డెహ్రాడూన్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా డీఎఫ్‌వో కిష్టగౌడ్, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, హన్మకొండ చెందిన డీఎఫ్‌వోలు, పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఇసుక కాంట్రాక్టర్ దౌర్జన్యం

- ప్రశ్నించిన రైతుపై దాడి
- డీఎస్పీ కి ఫిర్యాదు చేసిన రైతు

మణుగూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే రైతుపై స్థానికంగా ఇసుక ర్యాంపు నిర్వాహకుడిగా ఉన్న రమేష్ అనే వ్యక్తి పోలీసు స్టేషన్‌లో దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ విషయం పై బాధిత రైతు మణుగూరు డీఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేశాడు. రైతు నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బుధ వారం రోజు తనకున్న పొలం వైపునకు వెళ్తుండగా ఇసుక లారీలు మీదుకు దూసుకుని వచ్చాయని, ఆ విషయంపై ఇసుక కాంట్రాక్టర్‌కు తెలుపగా, అతను తననే దుర్భాషలాడని పోలీసు స్టేషన్‌కు వెళ్లి తనను పిలిపించాడని తెలిపారు. అక్కడ సీఐ కి జరిగిన విషయాన్ని తెలుపగా ఆ క్రమంలో మళ్లీ కాంట్రాక్టర్ తనను తిడు తూ సీఐ ముందే దాడికి పాల్పడ్డాడన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ గిరిజనులతో అట్రాసిటీ కేసు పెట్టిస్తానని చెప్పడం ఈ విషయంపై సీఐ కూడా కేసు నమోదు అవుతుందని అనడంతో తనకు భయం వేసిందన్నాడు. ఇరువురిని సమన్వయ పరిచి పంపించారని తెలిపారు. సీఐ ముందే తనను కాంట్రాక్టర్ కొట్టడం వల్ల ఎంతో మానసిక ఒత్తిడికి గురయ్యాయని తెలిపారు. కుటుంబ సభ్యులు ఈ విషయంపై ఫిర్యాదు చేయాల్సిందే అని తెలుపగా మణుగూరు డీఎస్పీ కి ఫిర్యాదు చేశానని విలేకరులకు తెలిపాడు.. వివరణ కోరేందుకు మణుగూరు సీఐకి ఫోన్ చేయగా స్పందించలేదు.

ఐఈడీ పేలి బాలుడికి గాయాలు

● ఆలస్యంగా వెలుగులోకి ఘటన

దుమ్ముగూడెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు అమర్చిన ఐఈడీపై ఆటల సందడిలో కాలు వేయడంతో.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఆదివాసీ మైనర్ బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని మారుమూల అటవీ ప్రాంతం పీడియా గ్రామానికి చెందిన 12ఏళ్ల బాలుడు ఈనెల 9న సాయంత్రం తన తోటి స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ఐఈడీపై బాలుడు పొరపాటున కాలు వేయడంతో.. అది పేలి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న సీఆర్‌పీఎఫ్ 199, 85 బెటాలియన్‌ల సిబ్బంది.. బాలుడికి ప్రాథమిక వైద్యం చేసి వెంటనే బీజాపూర్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. ప్రస్తుతం ఘటనా స్థలి ప్రాంత పరిసరాల్లో పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మరోవైపు.. బస్తర్ ప్రాంతంలోని పలుచోట్ల మావోయిస్టులు అమర్చిన మందుపాతరలు పేలి ఈ ఏడాది ఇప్పటి వరకు 38 మంది చనిపోయారని, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి.



గ్రీస్‌లో ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రీస్‌లో హాస్పిటాలిటీ, నిర్వాహణ సేవా రంగాలలో విదేశీ ఉద్యోగ అవకాశంకోసం దరఖాస్తు చేయాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్ శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ద్వారా గ్రీస్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ డిప్లొమా/డిగ్రీ కలిగన వారికి ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధృవీకరణ పొందిన అభ్యర్థులకు హాస్పిటాలిటీ, నిర్వాహణ సేవా రంగాలలో ఉద్యోగ అవకాశం కలిపించనున్నట్టు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తును టీవోఎంకామ్.రెజ్యూమ్‌రెటాఫ్‌జీ.మెయిల్.కామ్‌కు మెయిల్ చేయాలని సూచించారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మం అర్బన్/నేలకొండపల్లి అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాపర్తి నగర్ సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో టూటౌన్ ఏఈ బి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాపర్తినగర్, దొరన్న కాలనీ, రమణ గుట్ట, రాపర్తినగర్ బీసీ కాలనీ, టీఎన్జీవో కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేలకొండపల్లిలో..

నేలకొండపల్లి: మండల పరిధిలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్-స్టేషన్‌లో మరమ్మతులు పాటుగా, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్‌సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రామారావు చెప్పారు. సబ్-స్టేషన్ పరిధిలోని కొత్తకొత్తూరు,నేలకొండపల్లి, బోదులబండ, తిరుమలాపురం, పైనంపల్లి, రామచంద్రాపురం,అనంతనగర్,కోరట్లగూడెం, పాతకొత్తూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ప్రకటనలో తెలిపారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు 28లోగా దరఖాస్తు చేయాలి

ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శంకర్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ రెండేళ్ల కోర్సుల్లో చేరడానికి ఈనెల 28 సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తులు అందించాలని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ టి.శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ చదివిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఎంపీసీ, ఇతర అర్హులైన అభ్యర్థులకు తదుపరి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ధృవపత్రాలు జతచేసి ప్రభుత్వ వైద్యకళాశాలలో అందించాలని కోరారు.

మెరుగైన వైద్యంపై భరోసా కల్పించాలి

- అలక్ష్యంగా వ్యవహరించే ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వైద్యశాఖ అధికారులతో సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించి వారికి భరోసా కల్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఇక నుంచి వైద్యసిబ్బంది విధిగా ఆన్‌లైన్ ద్వారా హాజరు నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. పీహెచ్‌సీల పరిధిలో పనిచేసే ప్రతీ సిబ్బంది హాజరు ఆన్‌లైన్ చేసి పర్యవేక్షించాల న్నారు. కాన్పుల సమయంలో తల్లిమరణాలపై కలెక్టర్ మాట్లాడుతూ ఏఎన్సీ చెకప్ ప్రైవేటు ఆస్పత్రిలో చేసుకున్నట్లు తెలుస్తోందని దీనికికారణాలు ఏంటని కలెక్టర్ ప్రశ్నించారు.గతఏడాది కాలంగా ప్రతి ఆశా కార్యకర్త పరిధిలో మొదటి, రెండో ఏఎన్సీ చెకప్ ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగిన కేసులను పరిశీలించి నివేదికలను అందించాలని ఆదేశించారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు. వైద్యాధికారి తన పరిధిలో ఆశా కార్యకర్తలతో సమావేశాలు క్రమంతప్పకుండా నిర్వహించాలన్నారు.గర్భిణులకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించే ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న వసతులు ప్రైవేటు ఆస్పత్రుల్లో లేవని అవగాహన కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. గతఏడాది 58 శాతం డెంగీకేసులు నమోదు కాగా ఈఏడాది తగ్గాయని అభినందించారు. పారిశుద్యం వలన కేసులు నమోదవుతున్న గ్రామాల జాబితాను అందించాలని కలెక్టర్ సూచించారు. టీబీనిర్మూలనకు కృషిచేయాలన్నారు.టీహబ్ ద్వారా వైద్యపరీక్ష ఫలితాలు త్వరగా అందించేలా చూడాలలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. అనంతరం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రతిజ్ఞ చేపించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి కళావతీబాయి వివిధ ప్రోగ్రాంల అధికారులు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఘనంగా పారువేట



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కమాన్‌బజార్ శ్రీస్తంభాద్రి వెంకటేశ్వరస్వామి 61వ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామి వారి అశ్వవాహనము(పారువేట) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అశ్వవాహనంపై స్వామి వారి ఊరేగించారు. ఉదయం బిందె తీర్థం, ప్రాతరాధన, హవనము, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి రాజభోగం, సాయంత్రం సాయమారాధన, పూర్ణాహుతి, ధ్వజారోహణ, నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హజరై స్వామి వారిని దర్శించుకోని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈవో వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

తిరుమలాయపాలెం,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): కల్తీ ఎరువులు, పురుగు మందుల అమ్మితే చర్యలు తీసుకుంటాని ఏవో సీతారాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమలాయపాలెంలోని ఎరువులు, పురుగుమందుల షాపులను పరిశీలించారు. షాపుల్లోని స్టాకు వివరాలు,రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రదీప్, పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులపై ఫీజుల భారం తగ్గించాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల

ఖమ్మంఅర్బన్,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీవిద్యార్థులపై పెంచిన ఫీజుల భారాన్ని వెంటనే తగ్గించక పోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ డిమాండ్ చేశారు.శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు గతంలో గల ఫీజుల కంటేఇప్పుడు చాలా అధికంగా ఫీజులను పెంచారన్నారు. కాకతీయ యూనివర్సిటీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటం లేదన్నసాకుతో అదనపు వసూళ్లకుపాల్పడుతారా అని ప్రశ్నించారు. గతంలో వివిధరకాల ఫీజులు కలిసి రూ.910ఉంటే ఇప్పుడు రూ.2500కు పెంచారన్నారు. పరీక్ష ఫీజులు కలిసి రూ.3వేలనుంచి రూ.4వేలవరకు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. పెంచిన ఫీజులు వెంటనే ఉపసంహరిచకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా నాయకులు బొడ్డు రామకృష్ణ, పైండ్ల శ్యామల, మహంకాళిరాణి, కృష్ణవేణి, జంపన్న పాల్గొన్నారు. కేయూపరిధిలో పెంచిన వివిధ రకాల ఫీజులను ఉపసంహరిచుకోకపోతే ఆందోళన తప్పదని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గతంలో అన్నిరకాల ఫీజులు రూ.1340 చెల్లించాల్సివస్తే ఇప్పుడు రూ.3250కి పెంచారన్నారు. పెంచిన ఫీజులపై ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే పోరాటాలు నిర్వహిస్తాం అన్నారు. సమావేశంలో శివ, వంశీ, మనోజ్, పవన్, గోపి, ఉపేందర్, చైతన్య పాల్గొన్నారు.

బీసీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి

- 42శాతం రిజర్వేషన్ దీనికి నిదర్శనం
- ఖమ్మం ఏఎంసీ చైర్మన్, డిప్యూటీ మేయర్



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, డిప్యూటీ మేయర్ పాతిమా జోహారా

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిందని, బీసీలపై తమ పార్టీకి చిత్తశుద్ధి ఉందని ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, డిప్యూటీ మేయర్ పాతిమాజోహారా పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ జోడోయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకున్నారని రాహుల్ స్ఫూర్తితో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకునేందుకు కుయుక్తులు చేస్తున్నాయని, ఎన్నిఅడ్డంకులు వచ్చినా ఖచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు నూతన రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. కార్పొరేటర్లు కమర్తపు మురళి, లకావత్ సైదులునాయక్, పాకాలపాటి విజయనిర్మల, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి.. భారతీయ జనతా పార్టీ

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా, గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో పెట్టి బీసీలకు తీరని అన్యాయం చేసిన బీజేపీ పార్టీ ముమ్మాటికి బీసీల ద్రోహి అని జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారిపేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు అన్యాయం చేసిన బీజేపీ రాబోయే ఎన్నికల్లో భారీమూల్యం చెల్లించకతప్పదన్నారు. బీసీలకు ద్రోహం చేసిన ఎవరిని వదిలిపెట్టబోమన్నారు.ఈసమావేశంలో సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, కేతేపల్లి నాగేశ్వరరావు, మోడేపల్లి వెంకటాచారి పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే రిజర్వేషన్లతో ఆట

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు



ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లాభంకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లతో ఆడుకుంటుందని, అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా రాష్ట్రంతోపాటు జిల్లాలో కూడా ఎక్కడా అభివృద్ధి కనిపించడంలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరారవు అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బీసీవర్గాల మద్దతు సంపాదించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటుగా రిజర్వేసన్లు ప్రకటించిందని ఆరోపించారు. హైకోర్టుస్టేతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా నిలిచి పంచాయతీలు, మండలాలు, మునిసిపాలిటీలలో పరిపాలన స్థంభించిందని, ప్రజలకు అవసరమైన సేవలు కూడా అందడంలేదన్నారు. హైకోర్టు ఇచ్చిన రిజర్వేషన్లపై తీర్పు రేవంత్‌రెడ్డిప్రభుత్వ అహంకారంపై తీరుప అన్నారు. బీసీవర్గాలలో అసంతృప్తి రోజురోజుకు పెరుగుతుందని, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలయిందని, ఆరోపించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రధాన సమస్యలు అలాగే ఉన్నాయని, అన్నారు. ఈసమావేశంలో పార్టీప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరావు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, నాయకులు వీరవెల్లి రాజేష్ గుప్తా, కందుల శ్రీకృష్ణ, బెనర్జీ, సురేష్, రుద్రగాని మాధవరావు పాల్గొన్నారు.

పెన్షన్ ఇన్వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి: ఏఐబీడీపీఏ



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ పెరుగుదలను నిరోధించే పెన్షన్ ఇన్వాలిడేషన్ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఏఐబీడీపీఏ డిమాండ్ చేసింది. శుక్రవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేయటంతోపాటు అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా టాప్రా జిల్లాప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, ఏఐబీడీపీఏ జిల్లా కార్యదర్శి టి.శంకర్‌రావు మాట్లాడుతూ... ఇన్వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.. జాతీయస్థాయి ఆందోళనలో భాగంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించబోయే ఆందోళనకు సంఘీభావంగా ఈ నిరసన కార్యక్రమం జరిపినట్లు తెలిపారు. ధరల పెరుగుదలను అనుసరించి ఉద్యోగుల కరువు భత్యాన్ని కూడా ప్రభుత్వ విచక్షణ మేరకే బిల్లులో చేర్చారని అన్నారు. ఇన్వాలిడేషన్ అమలైతే కేంద్ర ఉద్యోగులకు భవిష్యత్తులో భత్యం పెరిగే అవకాశం ఉండబోదన్నారు. తీవ్రనష్టం కలిగించే చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఆందోళనలో నాయకులు ఏసీఎస్ తిరుమలాచార్యులు, రఘురాం, శ్రీనివాసరావు, గోపీచంద్, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంఅర్బన్,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవితోపాటునగర కాంగ్రెస్ కమిటీ పదవుల భర్తీకి ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావెద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవులకోసం ఆసక్తిగల వారు బయోడేటా కాపీనీ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తులను ఏఐసీసీ అబ్జర్వర్ పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాతృ వియోగం



కోటి లక్ష్మమ్మ

నేలకొండపల్లి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కట్టుకాచారం గ్రామానికి చెందిన మండల బీఆర్ఎస్ నాయకుడు కోటి శ్రీనివాసరావు తల్లి లక్ష్మమ్మ(85) శుక్రవారం ఉదయం మృతి చెందారు.మృతురాలు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. లక్ష్మమ్మ మృతి సమాచారం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు చెందిన తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు నెట్టెం రఘురాం, మండల టీడీపీ అధ్యక్షుడు అరెకట్ల కొండలరావు, అప్పలనర్సింహాపురం మాజీ సర్పంచ్ మన్నె నగేష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి గోవిందరావు, కొర్లకుంట నాగేశ్వరరావు, మండల నాయకుడు యడవల్లి సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, డీసీఎమ్మెస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, నంబూరి సత్యనారాయణ, వెన్నెబోయిన శ్రీను, షేక్.హుస్సేన్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

'హార్వెస్ట్'లో మానసిక ఆరోగ్య దినోత్సవం



బెలూన్‌లు ఎగురవేస్తున్న పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):శుక్రవారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో మానసిక ఆరోగ్య దినోత్సవం పై అవగాహన సదస్సు నిర్వహించారు. గొలుసులతో బంధించబడిన మనిషి ప్రతిమను చూపుతూ మనుషుల చర్యలను సామాజిక నియమాలు బంధిస్తున్నాయనే సంకేతాన్ని చూపుతున్న ప్రతిమను కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి ఆవిష్కరించారు. ప్రపంచ ఆరోగ్యాన్ని కోరుతూ బెలూన్లను విద్యార్థులచే ఎగురవేశారు. మనసు ఆరోగ్యమే మనజీవనశక్తి అనే అంశం మీద విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించి, సమస్యలను గుర్తించి సమయానికి చికిత్స పొందడంపై అవగాహన కల్పించారు. విద్యార్థులచే లోగో ఫోటోసెషన్ నిర్వహించారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):నగరంలోనిఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్‌ప్లేస్‌మెంట్‌లో 65 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. రెనాల్ట్ నిస్సాన్ వంటి అంతర్జాతీయ సంస్థలలో విద్యార్థులు ఎంపికకావటం అభినందనీయం అన్నారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక ఆదాయం రూ.3లక్షలకు పైగా ఉంటుందని అన్నారు. వీరిని చైర్మన్, కరస్పాండెంట్, సెక్రటరీ జి.ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్లు అభినందించారు.

నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10:30కు కూసుమంచి మండలం మునిగేపల్లిలో, 11గంటలకు నేలకొండపల్లి మండలం ముజ్జుగుడెంలో, 11:30గంటలకు పైనంపల్లిలో, 12 గంటలకు ఏదులాపురం మునిసిపాలిటితోపాటు పలు ప్రాంతాలలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం పలు కార్యక్రమాలలో పాల్గొని, సాయంత్రం తిరుమలాయపాలెం మండలంలో పర్యటించనున్నారు. సాయంత్రం తిరిగి హైద్రాబాద్ చేరుకోనున్నారు.

త్రివేణిలో కుటుంబ బంధాలపై అవగాహన



ఖమ్మంఖానాపరంహవేలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో శుక్రవారం కుటుంబం, కుటుంబం గొప్పతనం గురించి బంధాల గురించి బాంధవ్యాల గురించి తెలియపరిచేలా వసుదైక కుటుంబం గురించి పిల్లలకు వివరించారు. పిల్లలు రకరకాల వేషధారణలో వచ్చి అలరించారు. ఈకార్యక్రమం గురించి పాఠశాలల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ మళ్లీ ఉమ్మడి కుటుంబాలకు జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తల్లి దండ్రులు,కొడుకులు కూతుర్లు, అన్నదమ్ములు, అక్క చెల్లెలు మొదలగు బంధాల బాధ్యతలను వివరించారు. కుటుంబంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని విలువలు పాటించాలని అందరికీ ఆదర్శంగా ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల వైస్‌ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇన్‌చార్జ్ చార్లెస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న అప్రెంటీషిప్ మేళా

ఖమ్మంఖానాపురంహవేలి,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 13న జాతీయ అప్రెంటీషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాద్ తోపాటు ఖమ్మంలోని పలు కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, అప్రెంటీషిప్ రిజిస్టేషన్ కాపీ, ఎస్ఎస్‌సీ, ఐటీఐ మెమో, కుల ధ్రువీకరన పత్రం, రెండుపాస్‌పోర్ట్ సైజ్‌ఫోటోలతో హాజరు కావాలన్నారు.

నేడు మధిర నియోజకవర్గంలో భట్టి పర్యటన

మధిర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శుక్రవారం జరగ వలసిన తన పర్యటనను స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసి రిజర్వేషన్ల పై హైకోర్టు స్టే విధించడంతో భట్టి తన పర్యటనను శనివారానికి వాయిదా వేసుకున్నారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం చేరుకోనున్న భట్టి అక్కడ స్థానికులను కలుసుకుని ఆ తరువాత వైరాలో కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఆ తరువాత చింతకాని లో స్తానికంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని రాత్రి 8గంటలకు మధిర లోని క్యాంపు కార్యాలయానికి చేరుకుని రాత్రి మధిర లోనే బస చేయనున్నారు.

రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్ఎంకు వినతి

కారేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్ళతోపాటు మరో రెండు రైళ్లను నేటివరకు పునరుద్ధరించలేదని, రద్దు చేసిన రైళ్లనుపునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం కారేపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చిన డిఆర్ఎం గోపాలకృష్ణను మండల సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు వినతిపత్రం ద్వారా కోరాగా ఆయన దాన్ని పరిశీలించారు. కరోనా సమయంలో రద్దు చేసిన డోర్నకల్-భద్రాచలంరోడ్డు, మణుగూరు-కాజీపేటజంక్షన్ ప్యాసింజర్ రైళ్ళను నేటికి పునరుద్ధరించలేదని ఆ రైళ్లను వెంటనే పునరుద్ధరించాలని,డోర్నకల్ భద్రాచలం రోడ్డు మధ్యలో నడుస్తున్న రైళ్ళను మండల పరిధిలోని అన్ని స్టేషన్‌లలో హాల్టింగ్ కల్పించాలని కోరారు. సురేందర్ మనియర్, నారాయణ, బిచ్చానాయక్, తొగరశ్రీను పాల్గొన్నారు.


డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న సామాజిక కార్యకర్త సురేందర్‌రెడ్డి

దేశంలో ఓట్‌చోర్‌తో గద్దెనెక్కిన బీజేపీ

▸ సంతకాల సేకరణ ప్రారంభించిన సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓట్‌చోరీతోనే మూడవ సారి బీజేపీ అధికారంలోకి వచ్చిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఏఐసీసీ చేపట్టి ఓట్‌చోర్-గద్దిచోడ్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గాజుల రామారం డివిజన్‌లో ఆమె శుక్రవారం ప్రారంభించారు. దేశంలో ఓట్ల చోరీ జరిగిందని, దొంగ ఓట్లతో గెలిచిన దేశ ప్రధాని మోదీ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలున్నాయని, తప్పులను సరిదిద్దడంలో భారత ఎన్నికల సంఘం విఫలమైందని, ఇది కేవలం బీహార్ సమస్య కాదని యావత్ దేశం సమస్యగా మారి ఆందోళన కలిగిస్తోందన్నారు. అనంతరం ఇటీవల గ్రూప్-1లో డీఎస్పీగా ఉద్యోగం సాధించిన గోలి శ్రీనివాసరెడ్డి కుమార్తె హిమవర్షిణిరెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిరెడ్డి, నరేష్‌గౌడ్, వర్గాని వాసు, సుబ్బారెడ్డి, నర్సారెడ్డి, బండి సత్యనారాయణరెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి



మధిర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శారీరకంగానే కాకుండ మానసికంగా కూడా ఎంతో దృఢంగా ఉండాల్సిన అవసరముందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో మానసిక ఆరోగ్యంపై జరిగిన అవగాహన సదస్సులో అయన మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని నిరాశ చెందినప్పుడు దిగులు పడకుండా ఆ సమస్యల నుంచి బయట పడాలని కుటుంబ సభ్యులకు తమ సమస్యలు చెప్పుకోవాలని అన్నారు. అధ్యాపకులు డా.ఇందిర, శ్రీనివాస్, నాగరాజు, రామకృష్ణ, హరిక, మాధురి, జ్యోతి పాల్గొన్నారు.

యువతలో సామాజిక బాధ్యత పెరగాలి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యువతలో నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పెరగాలని స్పీకర్ లైన్ డా.సీహెచ్.శివప్రసాద్ (పీఎంజేఎస్) అన్నారు. మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం యువవికాస్ అనే అంశంపై ఇంటర్నేషనల్ లైయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. యువత దేశానికి బలమని, దేశ భవిష్యతు యువతపై ఆధారపడి ఉందని, నేటి పోటీ ప్రపంచంలో ఏ దేశమైతే టెక్నాలజీ రంగంలో స్వయం సంవృద్ధి సాధిస్తుందో ఆ దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్నారు. అందుకే నేడు విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన చదువుతో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో కొలువలను సాధించవచ్చన్నారు. తద్వారా తల్లీదండ్రులు, కళాశాలకు, సమాజానికి మంచిపేరు-ప్రతిష్ఠలు తేవొచ్చాన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, కొత్తూరు ప్రభాకరరావు, లైన్స్‌క్లబ్ బాధ్యులు మందపాటి ప్రభాకర రెడ్డి, గోగడ రమేష్, ఎంఎస్ఎస్‌వీ.రమణ, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తూరు ప్రభాకరరావు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్ నిమిత్తం ఉదయం 9గంటల నుంచి 12.30వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి టౌన్-1 ఫీడర్ పరిధిలోని జలగం నగర్, వెంగళరావు నగర్, వేంసూర్ రోడ్, ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లకు చెందినవినియోగదారులు సహకరించలన్నారు.

వైరాలో..

వైరా: వైరా టౌన్-1 ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం కొన్ని గంటలపాటు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ పి.సుందర్‌కుమార్ తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తల్లాడ రోడ్డు, లీలాసుందరయ్యనగర్,సుందరయ్యనగర్, మధు విద్యాలయ ప్రాంతం, బ్రాహ్మణపల్లి అగ్రహారం, బోడేపూడి కాలనీ, మధిర రోడ్డు, వాసవీ థియేటర్, సత్రంబజార్, ఎంపీడీవో కార్యాలయ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అందువల్ల వినియోగదారులు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కారేపల్లిలో..

కారేపల్లి: మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులోగల విద్యుత్ 33బై11కేవి సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా ఉదయం 9:30గంటనుంచి, మధ్యాహ్నం 11:30వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ సబ్ ఇంజనీర్ జి.ప్రీతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవి విశ్వనాధపల్లి ఫీడర్ పరిధిలోగల విశ్వనాధపల్లి, బంజర, గేటుకారేపల్లి, దుబ్బతండా, కొత్త కమలాపురం, పాత కమలాపురం, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలివేయడం జరుగుతందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

టాప్ యంగ్ డెంటిస్ట్ అవార్డుకు కల్లూరు వాసి ఎంపిక


పసుమర్తి సందీప్

కల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణానికి చెందిన పసుమర్తి సందీప్ అమెరికా వైద్యరంగంలో డెంటిస్ట్‌గా అత్యంత ప్రతిభ కనబరిచి టాప్ యంగ్ డెంటిస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు కుమారుడైన సందీప్ అమెరికాలోని వర్జినియా రాష్ట్రంలో డెంటల్ డాక్టర్‌గా పనిచెస్తున్నారు. డాక్టర్ సందీప్ విజయవాడలోని ఎన్టీఆర్ యూనివర్శిటీ అండ్ సైన్సెస్ నుంచి బీడీఎస్ డిగ్రీ పొందారు. ఆ తరువాత అమెరికాలోని నోవా సౌత్ ఈస్టాన్ యూనివర్శిటీలో పై చదువను పూర్తి చేసి అనంతరం వర్జీనియా రాష్ట్రంలో డాన్‌విల్లెలో దంత వైద్యునిగా సేవలు అందిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు అంగవైకల్యం కలిగిన వారికి, పునరావాస కేంద్రాలలో ఉన్న వారికి వైద్య సహాయం అందించినందుకు, దంత పరిశోధనలో క్రియా శీలక సహాయ సహకారాలు అందించినందుకు, అనేక పబ్లికేషన్స్ రచనలకు, అంతర్జాతీయ ఇంప్లాంటాలజిస్ట్ కళాశాల సభ్యుడిగా ఉన్నందుకు గాను ఈ అవార్డును ప్రకటించారు. అమెరికాలో ఎడ్జ్ పత్రిక నిర్వహించిన 15వ వార్షిక అమెరికా టాప్ యంగ్ డెంటిస్ట్ -2025(టాప్ 40-అండర్-40)లో ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. తన తల్లిందండ్రులే తనకు స్ఫూర్తిప్రధాతలన్నారు. అవార్డు గ్రహిత సందీప్‌కు కల్లూరు ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, స్థానిక వాసులు, మిత్రులు అభినందనలు తెలిపారు.